క్లుప్తంగా

గురుకుల ప్రవేశాలకు 23న రాత పరీక్షలు

తుని రూరల్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఐదు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 23న ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు లోవకొత్తూరులో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పది గంటల నుంచి 12 గంటల వరకు ఐదో తరగతి, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4.30గంటలకు వరకు ఇంటర్మీడియెట్ ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఏపీజీపీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఐదో తరగతి విద్యార్థులు, ఏపీజీపీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్‌టీఈఆర్ వెబ్‌సైట్‌లో ఇంటర్మీడియెట్ విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



ధర్మవరంలో ర్యాలీ చేస్తున్న ప్రజలు, పోలీసులు

ప్రత్తిపాడు రూరల్: ప్రమాదాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు అన్నారు. రోడ్డు భద్రతపై ధర్మవరం ప్రజలకు మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భారీ అవగాహన ర్యాలీ చేపట్టారు. ముందుగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రతపై విద్యార్థులతో కళా ప్రదర్శ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు దాటేటప్పుడు ఒక క్షణం ఆగి అటు ఇటు చూసుకొని దాటాలన్నారు. ప్రయాణంలో నిబంధనలు పాటిస్తూ, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్సై పవన్‌కుమార్, ఎంపీడీఓ వెంకటాచలం, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ మారిశెట్టి శివకుమార్, గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



బస్టాండు సెంటర్లో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

కోటనందూరు: స్థానిక బస్టాండు సెంటర్లో ఆక్రమణల తొలగింపునకు మంగళవారం అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాంతంలో వ్యాపారులు బస్‌షెల్టర్, రోడ్డును భారీగా ఆక్రమించేయడంతో ప్రయాణికులకు నిలువునీడ లేకపోవడంతో పాటు తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల నుంచి అందిన ఆదేశాల మేరకు రెవెన్యూ, పంచాయతీ, ఆర్టీసీ, ఆర్అండ్‌బీ, పోలీసులు సంయుక్తంగా ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకుని అధికారులకు సహకరించాలని కోరారు. స్వచ్ఛందంగా తొలగించని ఆక్రమణలను స్వయంగా అధికారులే తొలగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్, ఆర్టీసీ ఏడీఎం ఎంవీవీ రమణ, తుని రూరల్ సీఐ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

1156 రకం ధాన్యం కొనుగోలు చేయాలి

గోకవరం: ప్రభుత్వం 1156 రకం ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ గోకవరం మండల రైతులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించడంతో పాటు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 1156 రకం ధాన్యం కొనుగోలు చేయకపోవడం వలన రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి తమ వద్ద ఉన్న ఈ రకం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు చింతల రామకృష్ణ, జుట్టా వీరబాబు, రాయవరపు అప్పారావు, సురేష్ పాల్గొన్నారు.

మాస శివరాత్రి పూజలు

గండేపల్లి: తాళ్లూరు రామలింగేశ్వరస్వామికి మాస శివరాత్రి పూజలు, అభిషేకాలు చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన చిత్తా వెంకటరమణమూర్తి వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు స్వామి వారిని అర్చించి తరించారు. భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అరుణాచలేశ్వరుడికి ధాన్యాభిషేకం

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లి అరుణాచలేశ్వర స్వామి వారికి మంగళవారం ఘనంగా ధాన్యాభిషేకం చేశారు. వేదపండితులు గరిసె (30 బస్తాలు) ధాన్యంతో అభిషేకం చేశారు. ఈ ధాన్యాన్ని ఆలయ ప్రాంగాణంలో నిర్వహించే అన్నదానం, గోవులకు దాణా నిమిత్తం వినియోగించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

జగ్గంపేట: గ్రామ శివారు భగత్‌సింగ్ నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ మైదాన ప్రాంత నాయకులు మరుకుర్తియేసు, చిట్టిబాబు అన్నారు. భగత్‌సింగ్ నగర్‌లో ప్రజల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ప్రధానంగా కాలనీలో తాగునీరు, రోడ్లు, వైద్య సదుపాయాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వేసవితో తాగునీటి వెతలు తీర్చాలని తెలిపారు.

వేట నిషేధంలో ఆర్థిక ఆసరా

- ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకూ చేపల వేట నిషేధం
- 'మత్స్యకార భరోసా' అందించేందుకు ప్రభుత్వం సన్నద్ధం
- తీర గ్రామాల్లో సర్వే చేపట్టిన అధికారులు



దానవాయిపేట సముద్ర తీరంలో వలలు సరి చేసుకుంటున్న మత్స్యకారులు

తొండంగి: సముద్రంలో నిత్య జీవన పోరాటం చేసే గంగపుత్రులకు ప్రభుత్వం అండగా ఉంటోంది. చేపల వేట నిషేధ సమయంలో 'మత్స్యకార భరోసా' అందించి తోడుగా నిలుస్తోంది. చేపల వేట నిషేధం కాలం వచ్చింది. ఈ నెల 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకూ నిషేధం అమలులో ఉంటుంది. ఈ నిషేధ సమయంలో వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం మత్స్యకార భరోసా పథకంలో రూ.10 వేలను అందిస్తోంది. పథకానికి అర్హులైన మత్స్యకారులు గుర్తించేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమైంది.

గ్రామాల్లో సర్వే

గత ప్రభుత్వాల పాలనలో మత్స్యకారులకు అందించే ప్రోత్సాహం బియ్యం, వెయ్యి రూపాయల నగదు, అనంతరం రూ.2 వేలు ఉండేది. ఈ నగదును కూడా వేట నిషేధం కాలం ముగిసిన తర్వాతే అందేవి. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వేట నిషేధ సమయంలోనే మత్స్యకారులకు అందించే ప్రోత్సాహకాన్ని రూ.2 వేల నుంచి రూ.10 వేలకు పెంచారు. ఇలా వరుసగా మూడేళ్లు ప్రోత్సాహాన్ని అందించింది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు ఈ ఏడాది కూడా అందించేందుకు ఈ నెల 17వ తేదీ నుంచి తీర గ్రామాల్లో అర్హులైన మత్స్యకారులను గుర్తించేందుకు ఎన్యూమరేషన్ నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో సర్వే చేస్తున్నామని ఎఫ్‌డీవో సీహెచ్ ఉమామహేశ్వరరావు వివరించారు.

గతేడాది 2714 మందికి రూ.2.71 కోట్లు మంజూరు తొండంగి మండలంలోని వేమవరం, యర్రయ్యపేట, గొల్ల ముసలయ్యపేట, కొత్త పెరుమాళ్లపురం, దానవాయిపేట సచివాలయాల పరిధిలో మత్స్యకార గ్రామాల్లో 482 మోటారైజ్డ్ బోట్లకు 2,714 మందికి మత్స్యకార భరోసా పథకాన్ని వర్తింపజేశారు. వీరికి డీబీటీ ద్వారా ప్రభుత్వం రూ.2.71 కోట్ల నగదును మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది.

మత్స్యకార భరోసాకు కావాల్సిన అర్హతలివే..

- సంప్రదాయ బోటు, ఇంజిన్‌బోటు, మోటారైజ్డ్ బోటు ఎంఎస్ ఆక్ట్ 1958 ప్రకారం 2022 అక్టోబర్ నాలుగు నాటికి రిజిస్టర్ చేసి ఎన్యూమరేషన్ సమయానికి ఏపీఎంఎఫ్ఆర్ చట్ట ప్రకారం బోటు అమలులో ఉన్న లైసెన్సు ఉండాలి.
- బోటు చేపల వేట సామర్థ్యంతోపాటు ప్రభుత్వ రంగుల నిబంధనలు పాటించాలి.
- 18 మీటర్ల పైబడిన మెకనైజ్డ్ బోటుకు 10 మంది సిబ్బంది (బోటు యజమాని లేకుండా), 18 మీటర్ల పొడవు వరకూ కలిగిన మెకనైజ్డ్ బోటుకు 8 మంది సిబ్బంది(యజమాని లేకుండా) ఉండాలి. మోటారైజ్డ్ బోటుకు ఆరు మంది సిబ్బంది (బోటు యజమానితో కలిపి), సంప్రదాయ నావకు(ఇంజను లేని) మూడు మంది సిబ్బంది (బోటు యజమానితో కలిపి) వారిని అర్హులుగా గుర్తించి ఎంపిక చేస్తారు.



దానవాయిపేటలో ఎన్యూమరేషన్ నిర్వహిస్తున్న అధికారులు

- 2022–23 సంవత్సరంలో మెకనైజ్డ్ బోటు కనీసం 1000 లీటర్లు, మోటారైజ్డ్ బోటు కనీసం 100 లీటర్ల డీజిల్ ఆయిల్ వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకంలో వినియోగించుకుని ఉండాలి. ఒకే బోటు యజమానికి రెండు బోట్లు ఉన్నప్పుడు లేదా రేషన్ కార్డు లేనప్పుడు, హెచ్ఎస్‌డీ ఆయిల్ కార్డుకి దరఖాస్తు చేసుకోనప్పుడు ఆ బోటు యజమాని అండర్ టేకింగ్ ఇచ్చినట్టు అయితే బోటుపై పని చేసే కలాసీ మత్స్యకారులకు లబ్ధి పొందుతారు.
- లబ్ధిదారుడికి 31-03-2023 నాటికి 18 నుంచి 60ఏళ్ల వయస్సు ఉండాలి.
- కుటుంబ ఆదాయం పట్టణంలలో రూ1,44,000, గ్రామీణ ప్రాంతాల్లో రూ1,20,000 మించకూడదు.

పారదర్శకంగా నిర్వహిస్తున్నాం.



వేట నిషేధం సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకంలో రూ.10వేల ప్రోత్సాహకం అందించేందుకు మార్గదర్శకాలిచ్చింది. ఈ మేరకు అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు గ్రామ స్థాయిలో అధికారులు ఎన్యూమరేషన్ చేస్తారు. కచ్చితంగా అర్హులైన వారికే ఈ పథకం అందుతుంది. సర్వే పారదర్శకంగా చేస్తున్నాం.

– సీహెచ్ ఉమామహేశ్వరరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, తుని

జగనన్న రుణం తీర్చుకుంటాం



వేట నిషేధ సమయంలో జీవనోపాధి లేక ఇబ్బంది పడుతున్న మాకు గత ప్రభుత్వాలు బియ్యం, రూ.రెండు వేలు మాత్రమే ఇచ్చేవారు. అవి కూడా నిషేధ కాలం ముగిసిన తర్వాత ఇచ్చేవారు. సీఎం జగన్ వచ్చాక మాకు రూ.10 వేలు పెంచడంతోపాటు వేట నిషేధ సమయంలోనే వాటిని అందిస్తున్నారు. ఆయనను మళ్లీ గెలిపించి రుణం తీర్చుకుంటాం.

– గరికిన ప్రసాద్, మత్స్యకారుడు, దానవాయిపేట గ్రామం, తొండంగి మండలం

విద్యార్థినులు అన్నింటా రాణించాలి

శంఖవరం: విద్యార్థినులను అన్నింటా రాణించాలని విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక కేజీబీవీ పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. నేరుగా తరగతి గదులకెళ్లి విద్యపై విద్యార్థినులను ఆరా తీశారు. వేసవి సెలవులు, భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

అడ్మిషన్లపై ర్యాలీ

2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లపై శంఖవరంలో జీసీడీఓ ఉమామహేశ్వరి, ఎస్ఓ బాలమణికుమారి, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కృష్ణవేణి, పాఠశాల సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేజీబీవీ పాఠశాలలో వసతులు, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ఎంపీసీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 20 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

శ్రీస్ఫూర్తి ఫౌండేషన్ ప్రారంభం



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకుడు

తొండంగి: ఒంటిమామిడి ఆహా రెస్టారెంటు వద్ద శ్రీస్ఫూర్తి ఫౌండేషన్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నేమాల శ్రీనివాసరావు(ఎస్ఎస్ఆర్) పుట్టిన రోజు సందర్భంగా ఫౌండేషన్ ప్రారంభించి, రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. 56 మంది రక్తదానం చేసినట్టు వారు వివరించారు. కార్యక్రమానికి సప్తగిరి హేచరీస్ అధినేత సత్తిపెదబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంబుజాలపు నూకరాజు, రాజేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- ఇర్రిపాకలో గడప గడపకూ మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలను మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

జగ్గంపేట: ప్రభుత్వం అన్ని వర్గాల వారి ప్రభుత్వ పథకాలను అందిస్తోందని, వారి అభివృద్ధికి కృషి చేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. ఇర్రిపాక గ్రామంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు ఏవిధంగా అందుతున్నాయి, ఆ కుటుంబం పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట గండేపల్లి ఎంపీపీలు అత్తులూరి నాగబాబు, చలగళ్ల దొరబాబు, గండేపల్లి వైఎస్ ఎంపీపీ కుంచె రాజా,రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇళ్ల అప్పారావు కాపు, వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం



తుని టీచర్స్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పూజ చేస్తున్న సీపీ సుధారాణి

తుని: ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. మంగళవారం తుని పట్టణం 24వ వార్డు టీచర్స్‌కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఆమె శంకుస్థాపన చేశారు. పట్టణ పరిధిలోని 30 వార్డుల్లో కౌన్సిలర్ల విన్నపం మేరకు రోడ్లు, కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా కృషితో పురపాలక సంఘం అభివృద్ధిలో అగ్రభాగంలో ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఆయా వార్డుల నాయకులపై ఉందన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, తుని పట్టణ శాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణా గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, గాంధీనత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచంద్రరెడ్డి, ప్రభుత్వ బాలికల కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణ రాజు, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, మున్సిపల్ కమిషనర్ ప్రసదరాజు, వార్డు కౌన్సిలర్ పులి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నానబోలు దొరబాబు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటా 'జగనన్నే మా భవిష్యత్తు'



ఏలేశ్వరంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



జగ్గంపేటలో పథకాలను వివరిస్తున్న రఘురాం

ఏలేశ్వరం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, పార్టీ గృహసారథులు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. పట్టణంలోని 3వ వార్డులో వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జువ్విన వీరరాఘవమ్మ, జువ్విన వీర్రాజు ఆధ్వర్యంలో ఈ ప్రచారం జరిగింది. లింగంపర్తిలో సొసైటీ అధ్యక్షుడు చిక్కాల లక్ష్మణరావు, యర్రవరంలో సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, నీరుకొండ సత్యనారాయణ, పెద్దనాపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ నేత బుద్దా ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు.

సుపరిపాలన జగనతోనే సాధ్యం

జగ్గంపేట: సుపరిపాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. జగ్గంపేట అంబేడ్కర్ నగర్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలు వాటి వివరాలు తెలిపారు. ఎంపీటీసీలు చెరుకూరి జయరాజ్, వైఎస్సార్ సీపీ నేతలు గొల్లపల్లి శ్రీను, ఆకుల శ్రీధర్, కాపారపు ప్రసాద్, నీలపల్లి అప్పారావు, గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్లు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



జామియా మసీదులో ప్రార్థన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, ఎస్సై, ముస్లింలు

గోకవరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న జామియా మసీదులోని ముస్లింలకు ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వీరబాబు దంపతులు మంగళవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. తొలుత మసీదులో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, సుంకర వెంకటరమణ, ఎస్సై యువి శివనాగబాబు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. మసీదు చైర్మన్, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరక్టర్ ఎస్ఎస్ ఆలీషా, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, తోలేటి రాంప్రసాద్, ఉనుకూరి ఏసురత్నం, చంటిసాహెబ్ పాల్గొన్నారు.

తలుపులమ్మతల్లి పుట్టింటి సంబరాలకు సర్వం సిద్ధం

- నేడు జాగరణ, రేపు ఊరేగింపు, తీర్థం
- మరో పది గ్రామాల్లో జాతరోత్సవాలు



లోవకొత్తూరులో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగ్

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి పుట్టింటి సంబరాలుగా పేర్కొనే గంధామావాస్య జాతరోత్సవాలకు సర్వం సిద్ధమయ్యాయి. బుధవారం జాగరణ, గురువారం అమ్మవారి ఊరేగింపు, తీర్థం నిర్వహించేందుకు దేవదాయశాఖ (లోవ దేవస్థానం) అధికారుల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఈనెల తొమ్మిది గరగల సంబరంతో అమ్మవారి జాతరోత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి కళాకారులు వివిధ గ్రామాల్లో గరగల సంబరాలు చేస్తూ అమ్మవారి విశిష్టతను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. జాగరణ, జాతరోత్సవాలకు విద్యుద్దీపాలంకరణలు, భారీ సెట్టింగులు, వివిధ సాంస్కృతిక, జానపద, సాంఘిక ప్రదర్శనలు, కోలాటాలు, బాణసంచా కాల్పుల ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ ఎస్సై ఎ.బాలాజీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సంబరాలకు ఇప్పటికే ఆడపడుచులు, అల్లుళ్లు, బంధుమిత్రులు గ్రామాలకు చేరుకున్నారు.

నేడు పది గ్రామాల్లో..

గంధామావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని పది గ్రామాల్లో గ్రామ దేవతగా విరాజిల్లుతున్న తలుపులమ్మ జాతరోత్సవాలు బుధవారం జరగనున్నాయి. లోవ కొత్తూరులో తలుపులమ్మ అమ్మవారి దేవస్థానం, వెలమకొత్తూరు, సీతయ్యపేట, కొత్త వెలంపేట, రాజుపేట, మర్లపాడు, తాళ్లూరు, జగన్నాథగిరి, గెడ్డబీడు, కుమ్మరిలోవ గ్రామాల్లో ఆయా కమిటీల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

రేపు లోవకొత్తూరులో..

లోవకొత్తూరులో లోవ దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో రెండో రోజు (గురువారం) అమ్మవారి ఊరేగింపు, తీర్థం నిర్వహించనున్నారు.



ఎకరా భూమిలో విస్తరించిన మర్రిచెట్టు, మరిడమ్మతల్లి ఆలయం

నేడు మరిడమ్మ జాతర

దొండవాక శివారు ఎకరా భూమిలో విస్తరించి ఉన్న మర్రిచెట్టు ప్రాంగణంలో మరిడమ్మ అమ్మవారి జాతరను గ్రామస్తులు బుధవారం నిర్వహిస్తున్నారు. జాతర, అమ్మవారి దర్శనాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఒకే మర్రిచెట్టు ఎకరా విస్తీర్ణంలో విస్తరించి ఉండడం మరిడమ్మ అమ్మవారి మహిమగా గ్రామస్తులు భావిస్తారు. దాంతో మరిడమ్మను గ్రామదేవతగా పూజించి ప్రతి సంవత్సరం గంధామావాస్యకు జాతర దశాబ్దాలుగా నిర్వహిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, తీర్థం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ వితరణ



దివ్యాంగుడికి ట్రైసైకిల్, సరకులను అందజేస్తున్న దృశ్యం

తుని: సమాజంలో ధన వంతులు చాలా మంది ఉంటారు. ప్రజలకు సహాయపడే గుణం మానవత్వం కొందరికే ఉంటుందని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి సోదరుడు దాడిశెట్టి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ దాడిశెట్టి శ్రీనివాస్ నిరూపించారు. తుని పట్టణం 16వ వార్డులో దివ్యాంగుడి ట్రైసైకిల్ పాడైపోయి ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆ వార్డుకు చెందిన నాయకులు శ్రీనివాస్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన శ్రీనివాస్ మంగళవారం కొత్త ట్రైసైకిల్‌తో పాటు నిత్యావసర సరకులను దివ్యాంగుడికి అందజేశారు. దివ్యాంగుడి కళ్లల్లో ఆనందం వెల్లువిరిసింది. ప్రజలకు సేవ చేయడమే పరమావధిని శ్రీనివాస్ అన్నారు.

ప్రథమ చికిత్స అత్యవసరం

ప్రత్తిపాడు: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయ పరిస్థితిలో ఉంటే ప్రథమ చికిత్స అత్యవసరమని ప్రత్తిపాడు అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ ఎంజీ రత్నం అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక జాతీయ రహదారిపై ఇండియల్ ఆయిల్ బంక్ (దీప్తి సర్వీసింగ్ సెంటర్)లో 'ప్రథమ చికిత్స–అగ్నిప్రమాదాల నివారణ' అన్న అంశంపై సిబ్బందికి, వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ప్రమాదాల గురించి ప్రయోగాత్మకంగా వివరించారు.

రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

కోటనందూరు: వేసవిలో రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టామని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు. మంగళవారం మండలంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు(ఓహెచ్ఆర్)లను ఏక కాలంలో క్లీనింగ్ చేసే పనులు చేపట్టారు. కాకరాపల్లి, అల్లిపూడి గ్రామాల్లో జరిగిన మంచినీటి ట్యాంకుల క్లీనింగ్ పనులను పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ట్యాంకుల వద్ద క్లోరినేషన్ పరీక్ష నిర్వహించి నీటి నాణ్యతను తెలుసుకున్నారు. ప్రజలకు సరఫరా చేసే నీటిలో క్లోరినేషన్ శాతం ట్యాంకుల వద్ద 2.0 పార్టికల్స్ పెర్ మిలియన్(పీపీఎం), సరఫరా చివరలో 0.2 పీపీఎంగా ఉండాలని సూచించారు. నిబంధనల మేరకు నీటిని పరీక్షించి అందించాలన్నారు. మండలంలో 26 ట్యాంకులకు గాను 24 ట్యాంకులను ఒకేసారి శుభ్రపరిచినట్టు వివరించారు.

ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి



ప్రత్తిపాడులో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరం

ప్రత్తిపాడు: సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి కోరారు. ఆధార్ అప్‌డేట్ కోసం ప్రత్తిపాడు సచివాలయం–1లో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మండలంలో ఐదు రోజులు ప్రత్యేక శిబిరాలు

ప్రజలు తమ ఆధార్ కార్డులను క్రమబద్ధీకరించుకునేందుకు మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం తెలిపారు. ప్రత్తిపాడు, ఒమ్మంగి, ధర్మవరంలలో ఆధార్ అప్‌డేట్ జరుగుతుందన్నారు. ఈనెల 19న ఏలూరు, వెంకటనగరం, రాచపల్లి గ్రామ సచివాలయాల్లోనూ, 20న చినశంకర్లపూడి, ఉద్దండ జగన్నాథపురం, గజ్జనపూడి, శరభవరం, బవురువాక సచివాలయాల్లోనూ. 26న పెదశంకర్లపూడి, ఉత్తరకంచి, గోకవరం, పాండవులపాలెం, రౌతుపాలెం, బురదకోట గ్రామ సచివాలయాల్లోనూ, 27న లంపకలోవ, పోతులూరు, వాకపల్లి గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసే ప్రత్యేక శిబిరాలు జరుగుతాయన్నారు.

74 మందికి వైద్య పరీక్షలు

తుని: స్థానిక గణపతినగర్ మున్సిపల్ పార్కు వద్ద తుని వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 74 మందికి పరీక్షలు నిర్వహించినట్టు తుని శాఖ అధ్యక్షుడు కుందెం సత్యనారాయణ తెలిపారు. డయాబిటిక్ కేర్ సెంటర్ సహకారంతో బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు తమ దైనందిక కార్యకలాపాలను ఉదయం 11 గంటలలోపు, సాయంత్రం 5 గంటల తర్వాత చేసుకోవాలని డాక్టర్ జి.సూర్యనారాయణ సూచించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణ, కుచ్చర్లపాటి భీమరాజు, వాకర్స్ హెల్త్‌క్లబ్ ఎలెక్ట్ గవర్నర్ చదరం శివాజీ, సిటీ కేబుల్ ఎండీ బోడిశెట్టి త్రిమూర్తి స్వామి, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఏలేరులో తగ్గుతున్న నీటి నిల్వలు



ఏలేశ్వరం: వేసవి ఎండలకు ఏలేరు ప్రాజెక్టులో నీటినిల్వలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. ఎగువ పరివాహక ప్రాంతం నీరు చేరడంతో ప్రాజెక్టులో మంగళవారం నాటికి రూ.86.56 మీటర్లకు 77.27 మీటర్లు, 24.11 టీఎంసీలకు 10.48 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. దీంతో దిగువ ఆయకట్టుకు 600, విశాఖకు 225 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. పంపాకు, తిమ్మరాజుచెరువుకు నీటి విడుదలను నిలిపివేశారు.